www.vishalabharati.com
epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్
20.08.2024
సంపుటి:2 సంచిక:305

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

# రుణమాఫీ కాలేదన్న రైతులను అరెస్టులు చేస్తారా



- ప్రజాపాలనంటూ అప్రజాస్వామికంగా ప్రభుత్వం వ్యవహరిస్తుంది
- రుణమాఫీ సమస్యకు పరిష్కారం చూపకుండా గొంతెత్తిన వారిని అణగదొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గం
- ఆదిలాబాద్ రైతన్నలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి
- నమ్మి ఓటేసినందుకు రైతన్నను నట్టేట ముంచారు
- కాంగ్రెస్ పార్టీ రైతుల పాలిట శాపంగా మారింది :మాజీ మంత్రి హరీశ్ రావు

..మిగతా 2 లో

# త్వరలో 120 గురుకుల పాఠశాలల నిర్మాణం

- రాష్ట్ర వ్యాప్తంగా 5వేల కోట్లతో 30 ప్రాంతాల్లో గురుకులాలు
- గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 25 ఎకరాలు
- పట్టణాల్లో 10 నుంచి 15 ఎకరాలు సేకరణ
- 8 నెలల్లోనే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం
- గురుకులాల ఉన్నతాధికారులతో భట్టి, పొన్నం సమీక్ష
- ప్రతీ విద్యార్థి మంచంపైనే పడుకునేలా చర్యలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

> రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది 5వేల కోట్ల రూపాయలతో 30 ప్రాంతాల్లో 120 గురుకుల పాఠశాల భవనాలు నిర్మించనున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సమీకృత గురుకుల సముదాయాల కోసం నియోజకవర్గాల్లో స్థలాలు, డిజైన్ల ఎంపిక వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఉపముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 25 ఎకరాలు, పట్టణాల్లో 10 నుంచి 15 ఎకరాలు సేకరించాలన్నారు. ఎనిమిది నెలల్లోనే ఈ భవనాలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం వందశాతం అడ్మిషన్లు పూర్తి చేయాలని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థి మంచంపైనే పడుకునేలా చర్యలు తీసుకోవాలని, వెంటనే నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఉపముఖ్యమంత్రి ఆదేశించారు.
టాయిలెట్లు, బాత్ రూంలు, మంచినీరు, విద్యుత్ సదుపాయం, తలుపులు, కిటికీలు, దోమతెరలు తదితర వివరాలను హాస్టళ్లు, గురుకులాల్లో ప్రదర్శించాలన్నారు. గురుకులాల్లో అవసరమైన సదుపాయాలపై ఈనెల 29లోగా నివేదిక సమర్పించాలని విద్యాశాఖకు డిప్యూటీ సీఎం ఆదేశించారు.
విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్షిప్ రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వినతిపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు.
పెండింగులో ఉన్న ఓవర్సీస్ స్కాలర్షిప్ బకాయిల జాబితా ఇవ్వాలని అధికారులకు తెలిపారు. నిర్ణీత గడువులోగా ఓవర్సీస్ ఉపకార వేతనాల నిధులను విడుదల చేయించుకునే బాధ్యత అధికారులదేనిని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలపై సమీక్షించిన ఉపముఖ్యమంత్రి, విద్యార్థులకు మంచాలు, బెడ్స్, టాయిలెట్లు, బాత్ రూం, ప్రహారీ గోడ, భద్రత చర్యలు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



# క్రీడలకు కేంద్ర బిందువుగా తెలంగాణ

- హైదరాబాద్‌ను భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు వేదికగా మార్చాలి
- క్రీడలపై ఉత్సాహం ఉన్న వారిని ఆయా క్రీడల్లో ప్రోత్సహించాలి
- అన్ని యూనివర్సిటీల్లో క్రీడా విభాగాలు ఉండాలి
- స్పోర్ట్స్ యూనివర్సిటీకి యంగ్ ఇండియా పేరు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
దేశ క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ యూనివర్సిటీపై ఆయన వారితో చర్చించారు. ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏవిధంగా ఉండాలనే దానిపై పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకు ప్రాధాన్యం ఉండాలని, అన్ని రకాల క్రీడలను, క్రీడా శిక్షణ సంస్థలను ఒకే గొడుగు కిందకు తేవడమే స్పోర్ట్స్ యూనివర్సిటీ లక్ష్యమన్నారు.
మన దేశంతో పాటు తెలంగాణలోని భౌగోళిక పరిస్థితులు, మన శారీర నిర్మాణ తీరుకు అనువైన క్రీడలు ఏవో గుర్తించి, క్రీడలపై ఉత్సాహం ఉన్న వారిని గుర్తించి వారిని ఆయా క్రీడల్లో ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దశాబ్దాల క్రితమే ఆఫ్రోఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్‌ను భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు వేదికగా మార్చాలని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడలో మన క్రీడాకారులు పతకాలు దక్కేలా వారిని తీర్చిదిద్దాలని, అందులో మన స్పోర్ట్స్ యూనివర్సిటీ క్రీడాకారులు కచ్చితంగా ఉండాల్సిదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం వారికి నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇప్పించాలన్నారు.
రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని క్రీడా విభాగాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలలు, అకాడమీలు, క్రీడా శిక్షణ సంస్థలు అన్నింటిని స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో మన దేశ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో రాణించే షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, అర్చరీ, జావెలిన్ త్రో, హాకీకి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత శిక్షణ ద్వారా పతకాలు సాధించే అవకాశాలు ఉన్న క్రీడల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. యూనివర్సిటీలో ఆయా క్రీడల్లో శిక్షణకు అవసరమైన వసతులు, ఆహారంతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. చిన్నతనంలోనే విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలు, వారికి ఏ క్రీడలపై మక్కువ ఉందో ఉపాధ్యాయులు గుర్తించాలని ముఖ్యమంత్రి సూచించారు. అటువంటి విద్యార్థులందరికీ ఆయా క్రీడల్లో శిక్షణ ఇచ్చేలా ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఒక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ పాఠశాలల్లో విద్యా బోధనతో ఉంటుందని అయితే క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని, విద్యార్థులకు అక్కడ వారికి నచ్చిన క్రీడల్లో

..మిగతా 2 లో



# తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరైన దుర్గకు సీఎం, మంత్రి బాసట

- అండగా నిలవాలంటూ కలెక్టర్ కు ఆదేశం
- ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ.లక్ష నగదు సహాయం
- వీడియో కాల్ చేసి దుర్గతో మాట్లాడిన మంత్రి
- బాలికకు ఇల్లు సైతం నిర్మిస్తానని కోమటిరెడ్డి హామీ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
బాలిక దుర్గకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసటగా నిలిచారు. తల్లి ఆత్మహత్యకు పాల్పడటంతో ఒంటరిగా మిగిలిపోయిన చిన్నారి దుర్గకు అన్ని విధాలా అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. నిర్మల్ జిల్లా తానూర్ మండలం బేల్‌తరోడా గ్రామానికి చెందిన ఒంటరి మహిళ మేర గంగామణి (36) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆమె ఏకైక కుమార్తె

..మిగతా 2 లో

# సచివాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయొద్దు

- ఏర్పాటు చేస్తే, అధికారంలోకి వచ్చాక తొలగిస్తాం.
- ఆ స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిపాదించిన చోట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తప్పుబట్టారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని తెలిపారు. తెలంగాణ పౌరుషం, వైభవాన్ని చాటేలా అద్భుతంగా నిర్మించిన సచివాలయం సమీపంలో అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, పాలకులకు అమరవీరుల త్యాగాలను, స్ఫూర్తిని జ్వలింపజేస్తూ అమరజ్యోతి స్మారకాన్ని నిర్మించినట్లు వివరించారు.
తెలంగాణ అస్తిత్వం, ఆత్మ గౌరవానికి ప్రతీకైన తెలంగాణ తల్లిని ఆ మధ్యలో ప్రతిష్టించాలన్న ఉద్దేశంతో ఒక ఐలాండ్ను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ తల్లికి కేటాయించిన స్థలంలో కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెడుతోందని మండిపడ్డారు. వందలాది మంది తెలంగాణ ప్రజల ప్రాణాలు తీసిన కాంగ్రెస్ పార్టీ, మరోసారి తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా తెలంగాణ తల్లి



..మిగతా 2 లో



# మంకీపాక్స్ పట్ల అప్రమత్తంగా ఉండండి

- ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీ
- ఐసోలేషన్ వార్డులు, నోడల్ ఆసుపత్రులు ఏర్పాటు
- ఆఫ్రికాలో 18 వేలకుపైగా మంకీపాక్స్ కేసులు

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**
ప్రపంచ దేశాలను భయాందోళనకు గురిచేస్తున్న మంకీ పాక్స్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. దద్దుర్లు ఉన్న రోగులను గుర్తించి, వారికి వైద్యం అందిచడానికి ఐసోలేషన్ వార్డులు సిద్ధం చేయాలని అధికారులకు ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అలాగే దిల్లీలో మూడు నోడల్ ఆస్పత్రులను

..మిగతా 2 లో

# ఇంటింటా రాఖీ సంబురాలు

- ఇంటింటా రాఖీ సంబురాలు
- నేతలకు రాఖీ కట్టిన సోదరీమణులు
- రాఖీ పండుగ సహోదరత్వానికి ప్రతీక

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష జీవితాంతం ఒకరికొకరం అండ అంటూ సోదరీ సోదరుల మధ్య సహృద భావాన్ని చాటేదే పండుగ రాఖీ. ఈ వేడుకను యావత్ దేశమంతా నిష్ఠగా జరుపుకుంది. సోదరులు అండగా ఉంటాలంటూ సోదరీమణులు రాఖీలు కడితే, రక్షగా నిలుస్తానంటూ సోదరులు మాటిస్తారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజానీకానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సహోదరత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. పండుగ వేళ రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క, ఎంపీ కావ్య సహా పలువురు కార్పొరేషన్ ఛైర్మన్లు రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. జీవితాంతం తమకు తోడుండాలంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సోదరీమణులు రాఖీ కట్టి హారతులిచ్చారు. మహిళల రక్షణకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యానించారు. అక్కాచెల్లెళ్లకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇంట్లో పలువురు రాఖీకట్టి వేడుకను జరిపారు. రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సోదరిమణి రాఖీ కట్టగా ఆడబిడ్డకు అభివందనం చేశారు. రాఖీ పండుగను పురస్కరించుకుని పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు పలువురు కార్పోరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులు రాఖీ కట్టారు. నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కోదండరాంకు మహిళా సోదరీమణులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.తెలంగాణ భవన్‌లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు



..మిగతా 2 లో

# రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయండి

- రుణమాఫీ పేరుతో నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ మోసం చేసింది
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పగా చెబుతున్న రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయడమే కాకుండా రైతులకు నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇప్పించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా బండి సంజయ్ సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా బండి సంజయ్ అన్నా చెల్లెళ్లకు శుభాకాంక్షలు తెలిపారు.రుణమాఫీ



..మిగతా 2 లో

# క్రీడలకు కేంద్ర బిందువుగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి



శిక్షణ ఇచ్చి, ప్రతిభ ఆధారంగా వారికి స్పోర్ట్స్ యూనివర్సిటీలో వసతి కల్పించి మరింత పదును తేలేలా శిక్షణ ఇప్పించాలన్నారు..
హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశా క్రీడారంగానికి కేంద్ర బిందువుగా ఉండాలని, అందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇటీవల ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన దేశాలు, క్రీడాకారుల వివరాలను సేకరించి, ఆయా క్రీడాకారులు పతకాల సాధనకు శ్రమించిన తీరు, ఆయా దేశాలు వారిని ప్రోత్సహించిన తీరు, వారికి ఇచ్చిన శిక్షణ, ప్రోత్సాహం తదితరాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇప్పటికే స్కిల్ యూనివర్సిటీకి యంగ్ ఇండియా పేరు పెట్టామని, స్పోర్ట్స్ యూనివర్సిటీ యంగ్ ఇండియా పేరు ఖరారు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు యంగ్ ఇండియా పేరు పెడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ యంగ్ ఇండియాకు బ్రాండ్‌గా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యాల్లో తెలంగాణ ఒక శక్తిమంతమైన రాష్ట్రంగా గుర్తింపు పొందడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.



## తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరైన దుర్గకు సీఎం, మంత్రి బాసట

మొదటిపేజీ తరువాయి

దుర్గ (11) అనాథగా మిగిలింది. తల్లి అంత్యక్రియలకు డబ్బు లేకపోవడంతో దుర్గ భిక్షాటన చేసింది. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. బాలికకు విద్య, వైద్యం, ఇతర అవసరాలకు అండగా నిలవాలని సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు బాలికకు ఉచిత విద్య అందించేందుకు గురుకుల పాఠశాలలో చేర్చుతామని కలెక్టర్ వెల్లడించారు. వైద్య, ఇతర సమస్యలేమైనా ఉంటే వాటిని వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.బాలిక దుర్గకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సైతం అండగా నిలిచిన విషయం తెలిసిందే. తన ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ.లక్ష నగదును తహసీల్దార్ లింగమూర్తి, ఎంపీడీవో అబ్దుల్ సమద్ ద్వారా అందించారు. ఈ నగదును స్థానిక అధికారుల చేత చిన్నారికి అందించారు. దుర్గ చదువు పూర్తయ్యేవరకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. బాలికకు ఇల్లు సైతం నిర్మిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ మేరకు స్థానిక నేతలకు వీడియో కాల్ చేసి చిన్నారి దుర్గతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఖర్చుల నిమిత్తం ప్రతి నెలా డబ్బులు పంపుతానని, త్వరలో కలుస్తానని చెప్పారు. అనాథ బాలికను ఆర్థికంగా ఆదుకుంటామని స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ హామీ ఇచ్చారు. ఆమె విద్యాభ్యాసానికి సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## సచివాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయొద్దు

మొదటిపేజీ తరువాయి



విగ్రహాన్ని పక్కకు పెట్టి, రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెడుతోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జై తెలంగాణ అనరని, అతి పెద్ద అంబేడ్కర్కు కనీసం పూలదండ వేయరని, అమరజ్యోతిలోకి ఇప్పటి వరకు సందర్శకులను అనుమతించ లేదని ఆక్షేపించారు. తెలంగాణ బిడ్డ అంజయ్యను అవమానించిన రాజీవ్ గాంధీ విగ్రహం పెడుతున్నారని, ఆయనకు తెలంగాణతో ఏం సంబంధమని కేటీఆర్ ప్రశ్నించారు. గత పదేళ్లలో తాము ఏనాడూ పేర్ల మార్పుపై ఆలోచించలేదన్న ఆయన, కాంగ్రెస్ పార్టీ పెడుతున్న రాజీవ్ గాంధీ విగ్రహాన్ని అధికారంలోకి రాగానే అక్కడి నుంచి తరలిస్తామని చెప్పారు. రాహుల్ గాంధీ దగ్గర మార్కులు కొట్టేయాలనుకుంటే గాంధీ భవన్లో లేదా రేవంత్ రెడ్డి ఇంట్లో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టుకోవాలని సూచించారు. నాలుగేళ్లలో తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, రాజీవ్ గాంధీ విగ్రహాన్ని సకల మర్యాదలతో తొలగించి, కాంగ్రెస్ పార్టీ కోరుకున్న చోటికి పంపిస్తామని అన్నారు. ఇవాళ తెలంగాణ తల్లికి కాంగ్రెస్ పార్టీ చేసిన అవమానాన్ని మరచిపోలేమని వ్యాఖ్యానించారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లుగానే తెలంగాణ మహనీయుడి పేరును అంతర్జాతీయ విమానాశ్రయానికి పెడతామని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ ఆత్మగౌరవం, అమరవీరుల త్యాగాలను అవమానపరిచేలా రాజీవ్ గాంధీ విగ్రహం పెడుతున్న కాంగ్రెస్ పార్టీ తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణ తల్లి విగ్రహానికి అవమానం జరిగితే ఊరుకోం. సచివాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయొద్దు. రాజీవ్ విగ్రహం ఏర్పాటు చేస్తే, అధికారంలోకి వచ్చాక తొలగిస్తాం. శంషాబాద్ విమానాశ్రయానికి కూడా రాజీవ్ పేరు తొలగిస్తామని కేటీఆర్ అన్నారు.



## రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేసిన అభిషేక్ మనుసింఘ్వీ

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

కాంగ్రెస్ సీనియర్ నేత, సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పాల్గొన్నారు.ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులు పీయూష్ గోయల్, సర్బానంద సోనోవాల్, జ్యోతిరాదిత్య సింధియా, కామాఖ్య ప్రసాద్, వివేక్ ఠాకూర్, రాజేభోస్లే, బిప్లవ్ కుమార్ దేవ్, మీసా భారతి, దీపేంద్రసింగ్ హుడా, కేసీ వేణుగోపాల్ లోక్‌సభకు ఎన్నికయ్యారు. దాంతో వారు తమ రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. అదేవిధంగా ఒడిశాలో మమతా మొహంత, తెలంగాణలో కే కేశవరావు తమ పదవులకు, పార్టీలకు రాజీనామాలు చేశారు.





# ఇంటింటా రాఖీ సంబురాలు



మొదటిపేజీ తరువాయి

మహిళా ప్రజాప్రతినిధులు కేటీఆర్‌కు రాఖీ కట్టారు. సోదరి కవిత తనకు రాఖీ కట్టలేకపోయినా ఎప్పటికీ అండగా ఉంటానని కేటీఆర్ తెలిపారు. గతంలో సోదరి కవిత రాఖీ కట్టిన ఫోటోలను ఎక్స్ వేదికగా పంచుకుని గుర్తుచేసుకున్నారు. సిద్దిపేట శాసనసభ్యుడు హరీశ్‌రావుకు హైదరాబాద్ కోకాపేట్‌లోని ఆయన నివాసంలో పలువురు మహిళలు రాఖీలు కట్టగా వారి అభిమానానికి హరీశ్ ధన్యవాదాలు తెలిపారు. మేడ్చల్ శాసనసభ్యుడు మల్లారెడ్డి రాఖీ పౌర్ణమి సందర్భంగా బోయినపల్లి క్యాంపు కార్యాలయంలో సోదర, సోదరీమణులతో రాఖీ పండుగ జరుపుకున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో బ్రహ్మకుమారీలు ఎమ్మెల్యే మాణిక్‌రావుకు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు



















## మంకీపాక్స్ పట్ల అప్రమత్తంగా ఉండండి

మొదటిపేజీ తరువాయి

సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. విమానాశ్రయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే అనుమానితులకు RTPCR వ్యాధి నిర్ధరణ పరీక్ష చేయాలని మంత్రిత్వశాఖ ఆదేశించింది. ఆఫ్రికాలో ఈ ఏడాది 18 వేలకుపైగా మంకీపాక్స్ కేసులు నమోదయ్యాయి. పొరుగుదేశం పాకిస్తాన్‌లోనూ మంకీపాక్స్ కేసులు వెలుగుచూశాయి. మంకీపాక్స్ కేసుల్లో మరణాల రేటు 1 నుంచి 10 శాతం వరకు ఉంది. డబ్ల్యూహెచ్ఓ ప్రకారం, మంకీపాక్స్ వైరస్ మనిషి శరీరం లోపలికి ప్రవేశించిన తర్వాత 1 నుంచి 21 రోజుల్లో ఎప్పుడైనా లక్షణాలు బయటపడవచ్చు. పొక్కులు, జ్వరం, గొంతు ఎండిపోవడం, తల, కండరాల నొప్పులు, వెన్ను నొప్పి, నిస్సత్తువ వంటివి సాధారణంగా కనిపిస్తాయి. ఇవి దాదాపు 2 నుంచి 4 వారాలపాటు కొనసాగవచ్చు. ఇది సదరు వ్యక్తి ఇమ్యూనిటీ పవర్పై ఆధారపడి ఉంటుంది. కొంతమందికి నోరు, కళ్లు, గొంతు, ప్రైవేట్ భాగాలపై పొక్కులు రావొచ్చు.

## రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయండి

మొదటిపేజీ తరువాయి



పేరుతో ఇంతకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే రైతులు ఎంతమంది బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు, రుణమాఫీ ఎంతమందికి వర్తించిందో అన్ని లెక్కలు క్రోడీకరించి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చనిపోయిన రైతులకు సైతం రుణమాఫీ చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు.
కాంగ్రెస్ పార్టీ నాయకులు అద్దాల మేడల్లో కూర్చొని, అందరికీ రుణాలు మాఫీ చేశామని ప్రచారం చేస్తున్నారని కేంద్ర మంత్రి ఘాటుగా విమర్శించారు. సోనియా గాంధీ పుట్టిన రోజునాటికి అన్ని మాఫీ చేస్తామని చెప్పి, ఇప్పుడు మొక్కుబడిగా చేయడమంటే సోనియాగాంధీని మోసం చేసినట్లు కాదా అని ప్రశ్నించారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తే అన్నదాతలు ఎందుకు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.
కాంగ్రెస్ పార్టీ నాయకులు అద్దాల మేడల్లో కూర్చొని నూటికి నూరుశాతం అందరికి రుణాలు మాఫీ చేశామని అనుకుంటున్నారు. కానీ బ్యాంకు అధికారుల లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఎంతమంది బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. రాష్ట్ర సర్కార్ రుణమాఫీ ఎంతమంది రైతులకు వర్తించిందో అన్ని లెక్కలు క్రోడీకరించి శ్వేతపత్రం విడుదల చేయాలి. అలానే రైతులకు ఎన్వోసీ ఇప్పించండని అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనమన్న అంశాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని, రుణమాఫీ జరిగిందా? లేదా? కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసిందా? లేదా? చూసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో విలీనమైతే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలోనే చాలా మంది సీఎం కావాలని ఆశావహులు ఉన్నారని, ఎవరికి వారు తమ బలాన్ని పెంచుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారేమోనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు.



## దేవాలయ అభివృద్ధికి రూ.50 వేల 116 విరాళం

**సూర్యాపేట, విశాల భారతి** సూర్యాపేట పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డ్ లోని ఖాశీం పేటలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయం అభివృద్ధికి సూర్యాపేట పట్టణానికి చెందిన క్షీరసాగర్ సరోజిని భర్త కేటి బాబురావు జ్ఞాపకార్థం 50 వేల 116 రూపాయల విరాళాన్ని సోమవారం దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి విరాళాన్ని అందజేయడం హర్షణీయమని భగవంతుని ఆశీస్సులతో వారి కుటుంబానికి ఆయుర్ ఆరోగ్యాలు కల్గాలని ఆకాంక్షించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో పౌర్ణమిని పురస్కరించుకొని అనఘాష్టమి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామకృష్ణనంద దత్తగురుస్వామి, జాదవ్ సురేష్, రేగట్టె లింగయ్య, ఐతరాజు లింగయ్య, నీరుడు వెంకట రత్నం రాజ్యం, రేగట్టె సత్యనారాయణ, నీల వెంకట్రావ్, మోర్తాల లింగమ్మ, ఐతరాజు పాపయ్య, సిరపంగి సహదేవుడు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## అన్నాచెల్లెళ్ళు అక్క తమ్ముళ్ళ అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

- **బీ ఆర్ ఎస్ పార్టీ సూర్యాపేట మండల నాయకులు**

**సూర్యాపేట, విశాల భారతి** అన్నా చెల్లెళ్ళు అక్క తమ్ముళ్ల అను బంధానికి ప్రతీక రక్షాబంధన్ అని బీ ఆర్ ఎస్ పార్టీ సూర్యాపేట మండల నాయకులు పులగం రాఘవ రెడ్డి అన్నారు. సోమవారం రాఖీ పండుగ సందర్భంగా ఆయన నివాసంలో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదమ్ముల కు ఎలాంటి ఆపద రాకుండా అక్క చెల్లెళ్ళు రాఖీ కట్టి రక్షగా నిలుస్తారని అన్నారు. అలాగే రాఖీ కట్టిన అక్క చెల్లెళ్లకు అన్నదమ్ములు మేమున్నామని భరోసాను ఇస్తారని అదే రాఖీ పండుగ ముఖ్య ఉద్దేశం అన్నారు.

## రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట, విశాలభారతి** రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు.సూర్యాపేట జిల్లాలోని రైతులను ఇబ్బందులకు గురిచెస్తున్న ఇద్దరు తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులను సస్పెన్షన్ చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.కోదాడ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సాయిరాం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి. సుజిత్ పై రైతుల నుండి పలు ఆరోపణలు రావడంతో స్పందించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోదాడ ఆర్డివో ను విచారణకు ఆదేశించారు. విచారణలో వాస్తవాలు నిజమేనని తేలడంతో కోదాడ తహశీల్దార్ సాయి రాంను బదిలీ చేశారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుజిత్ ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదే విదంగా సూర్యాపేట కలెక్టరేట్ కార్యాలయంలో పరిపాలన విభాగంలో డిప్యుటేషన్ పై పని చేస్తున్న నాగారం తహశీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ షఫీ ఉద్యోగుల నుండి పలు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ విచారణలో వాస్తవాలు రుజువు కావడంతో సదురు ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.



## ప్రజావాణి దరఖాస్తులపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి

- **కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్**

**సూర్యాపేట, విశాలభారతి** జిల్లా అధికారులు ప్రజావాణి దరఖాస్తుల పై వెంటనే చర్యలు తీసుకోవాలి అని జిల్లా కలెక్టర్ తేజుస్ నంద్ లాల్ పవర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి ఎస్ లత తో కలసి పాల్గొని అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ, క్లినికల్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, బయోమెట్రిక్ అటెండన్స్ విదిగా సిబ్బంది అందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రతి రోజు సిబ్బంది అందరూ బయోమెట్రిక్ నందు ఫేస్ రికగ్నేషన్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలి అని, కార్యాలయంలో సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే అధికారులు పరిష్కరించాలని అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా అధికారులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజావాణిలో భూ సమస్యలు పై 5, డి ఎం హెచ్ వో 1,డి ఏవో 2, ఆర్ అండ్ బి01, ఇతర శాఖలు 4 మొత్తం 13 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా సంబంధిత దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరిటెండెంట్స్ పద్మారావు, శ్రీలత కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులు జడ్పీ సీఈఓ అప్పారావు, స్త్రీ,శిశు సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రేడ్డి డిసిఓ పద్మ , సిపిఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్లకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించిన కలెక్టర్



**వనపర్తి, విశాల భారతి::** జిల్లాలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం ఐ.డి. ఓ.సి సమావేశ మందిరంలో ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులతో సీజనల్ వ్యాధుల నివారణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు జిల్లాలో ఎక్కడ నమోదు అయిన వెంటనే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తి కుటుంబ సభ్యులతోపాటు చుట్టూ పక్కల జ్వరం సర్వే చేయడం, రక్త నమూనాలు సేకరించి ల్యాబ్ కు పంపించడం జరగాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రిలో నమోదు అయిన పాజిటివ్ కేసులు జిల్లా వైద్య శాఖకు తెలిస్తేనే నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు ఎక్కువ మొత్తంలో వైద్య ఖర్చులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు వైద్య రేటు తెలిపే సూచిక బోర్డులు ఆసుపత్రి ప్రవేశ ద్వారం వద్ద పెట్టాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో పని చేసే మహిళా డాక్టర్లకు, మహిళా సిబ్బందికి రక్షణ కల్పించేందుకు జిల్లా పోలీస్ శాఖ భద్రత కలిస్తుందని తెలియజేశారు. రాత్రి వేళల్లో పనిచేసే చోట ఒక కానిస్టేబుల్ ను ఉంచేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందని అన్నారు.

**నిబంధనలకు అనుగుణంగా ఆసుపత్రులు, క్లినిక్ లకు జిల్లా కమిటీ ద్వారా ఆమోదము:**

కొత్తగా ఆసుపత్రులు, డయజ్ఞస్టిక్ సెంటర్లు, క్లినిక్ లు , పాత వాటికి రెన్యువల్ కోరకు ఆన్లైన్ ద్వారా పెట్టుకున్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ పరిశీలించింది. దరఖాస్తులో నిబంధనల ప్రకారం సమర్పించిన డాక్యుమెంట్లు, ఫోటోలు పరిశీలించి అన్ని అర్హతలు ఉన్న వాటికి కమిటీ ద్వారా ఆమోదం తెలిపింది. నిబంధనల ప్రకారం లేని వాటిని తిరస్కరించింది. జిల్లా వైద్య అధికారి డా. జయచంద్ర మోహన్, అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్, డా. సాయినాథ్ రెడ్డి, పి హెచ్.సి ల మెడికల్ డాక్టర్లు, ప్రైవేట్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## రూ.28 లక్షలు దొంగలించిన నిందితులు అరెస్ట్

**బెల్లంపల్లి విశాల భారతి** 17 వ తేదీన బెల్లంపల్లి బజార్ ఏరియాలో 28 లక్షల రూపాయలు దొంగలించిన విషయం సంచలనం రేపింది. అదే విషయం పై సిపి, శ్రీనివాస రావు ఐ జి, ఆదేశాల మేరకు డి.ఎస్.పి. భాస్కర్, ఎసిపి, రవికుమార్, బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్ హెచ్ ఓ దేవయ్య, ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేకమైన పోలీస్ టీమ్లను ఏర్పాటు చేసి సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దొంగలను త్వరగా పట్టుకున్నారు. సిపి కేసు వివరాలను మీడియాకు తెలుపుతూ, నలుగురు నిందితులు బెల్లంపల్లిలో పార్కు చేసిన కారులో నుండి రూ 28 లక్షలు ఎత్తుకెళ్లారని, పోలీస్ బృందం త్వరగా వారిని పట్టుకొని డబ్బుని స్వాధీన పరుచుకున్నారని వారు తెలిపారు. నలుగురు నేరస్తులలో ఒకరు, దాసు అనే వ్యక్తి డబ్బులు కాజేసిన ఓనర్ దగ్గర గతంలో డ్రైవర్గా పనిచేసేవారని, డబ్బు మీద వ్యామోహంతో త్వరగా డబ్బులు సంపాదించి జల్సాలు చేసుకోవాలని దురుద్దేశంతో డూప్లికేట్ ' కి 'తమ దగ్గర ఉంచుకొని, బెల్లంపల్లిలో వసూల్ కోసం వస్తున్న కారుని వెంబడించి పక్క ప్లాన్ తోటి డబ్బులు కాజేశారని వారు తెలిపారు. నలుగురు నేరస్తులను అరెస్టు చేసి రిమాండ్ కు పంపుతున్నట్లు వారు తెలిపారు. త్వరగా పట్టుకున్న పోలీసులకు సిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో, డిసిపి భాస్కర్ ఏసీపి రవికుమార్, వన్ టౌన్ ఎస్ హెచ్ ఓ దేవయ్య, కానిస్టేబుల్ మల్లేశం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## కేటీఆర్ కు రాఖీ కట్టిన కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

**కూకట్ పల్లి విశాల భారతి:** రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును కలిసి రాఖి కట్టిన కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోదర సోదరీమణుల అనుబంధాలకు ప్రతీకగా జరుపుకునే పండుగ అని, ప్రతి ఏడు లాగే ఈసారి కూడా కేటీఆర్ అన్నయ్యకు రాఖి కట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాఖి పౌర్ణిమ అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని మరింత బలపడేలా చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## మల్లారెడ్డి పల్లిలో పల్లె ప్రకృతి వనం చెట్లు నరికివేత

**చింతపల్లి, విశాల భారతి** గత ప్రభుత్వం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలలో ఒక్కొక్క గ్రామ పంచాయతీకి సుమారు పది లక్షల రూపాయల వరకు వెచ్చించి పల్లె ప్రకృతి వనాల ను ఏర్పాటు చేసింది. అయితే నేడు వాటిపై రక్షణ లేకపోవడంతో కొందరు గ్రామస్తులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ చింతపల్లి మండల పరిధిలోని మల్లారెడ్డి పల్లి గ్రామంలో ప్రకృతి వనంలో ఏపుగా పెరిగివున్న పచ్చని చెట్లను సోమవారం ఉదయం 9 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. లక్షలాది రూపాయలు వెచ్చించి పెంచినటువంటి చెట్లను నరికి వేయడం ఎంతవరకు సమంజసమని ఆ గ్రామానికి చెందిన కొందరు గ్రామ పెద్దలు పంచాయతీ కార్యదర్శి కి సమాచారం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంతో గ్రామాలలో ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయల తో పాటు ప్రతి ఇంటి ముందు చెట్లు నాటాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తుంటే మరోపక్క పెరిగిన చెట్లను నరకడం దుండగలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లుగా నరికి వేసిన చెట్లను బట్టి అర్థం అవుతుందని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తమరుస్తున్నారు. ఈ తతంగం చూస్తుంటే గ్రామాలలో రాజకీయ రగడ మొదలవుతున్నట్లు కనిపిస్తుంది. ఏది ఏమైనా గ్రామపంచాయతీ కార్యదర్శి కి కానీ, ఫారెస్ట్ అధికారులకు గాని, జిల్లా అధికారులకు గాని తెలియకుండా చెట్లను నరికి వేయడం నేరం చేసినట్లేనని గ్రామ ప్రజలు, పంచాయతీ కార్యదర్శికి స్థానిక పోలీస్ స్టేషన్లో చెట్లను నరికిన దుండగలపై చట్టరీత్యాచార్యులు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువెళ్లనట్లు పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి ఓ.సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చింతపల్లి ఎస్ఐ. యాదయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## అక్క చెల్లెల్లందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు

- **కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరిసతీష్ రెడ్డి**

**కూకట్ పల్లి, విశాలభారతి:** నియోజకవర్గం మహిళలందరికీ కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మానవ సంబంధాల్లోని పవిత్రమైన సహోదరభావాన్ని బలోపేతంచేసే రక్షాబంధన్ 'రాఖీ పండుగ' అని అన్నారు.ఈ పండుగను అన్నాచెల్లెళ్లు లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు.. అక్కతమ్ముళ్ల , అన్నా చెల్లెల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక అని.. సోదరుడు సోదీరిమణుల అనురాగానికి సంకేతమైన ఈ పండుగను కుటుంబ సభ్యులందరూ కలిసి సంతోషంగా జరుపుకుంటారని అన్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. మహిళల సాధికారతతో పాటు మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని అన్నారు. మహిళల రక్షణ, భద్రత విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని అన్నారు. అదేవిధంగా పండుగను చక్కటి వాతావరణంలో కుటుంబ సభ్యుల మధ్యన ఆనందంగా సంతోషకరంగా జరుపుకోవాలని అన్నారు.

# అర్హులందరికీ రుణమాఫీ చేస్తాం

- **సాంకేతిక కారణాలతో కొందరికి రుణమాఫీ కాలేదు**
- **ఆ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం**
- **రైతులను రుణ విముక్తులను చేయాలన్న దృఢ సంకల్పం ఉంది.**
- **రాజకీయ దురుద్దేశంతోనే విపక్షాలు తప్పుడు ప్రచారం**
- **పదేళ్ల అధికారంలో బీజేపి రుణమాఫీ గురించి మాట్లాడలేదు**
- **రైతులను మోసం చేయడమే బీఆర్ఎస్ కు అలవాటే**
- **పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో జరిగిన రుణమాఫీ, దేశంలో ఇంతవరకు ఎప్పుడూ జరగలేదని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎర్రమంజిల్‌లోని జలసౌధలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 తర్వాత బీజేపీ ఎప్పుడూ రుణమాఫీ గురించి మాట్లాడలేదన్న ఆయన, పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీ, రైతుల కోసం ఎలాంటి మంచి పనులు చేయలేదని విమర్శించారు. రైతులను రుణ విముక్తులను చేయాలన్న దృఢ సంకల్పంతో తాము సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొందరికి రుణమాఫీ జరగలేదని, వారికి కూడా నూటికి నూరు శాతం రుణమాఫీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాజకీయ దురుద్దేశంతోనే విపక్ష పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

అధికారంలో ఉన్నా లేకపోయినా రైతులను మోసం చేయడమే బీఆర్ఎస్కు అలవాటన్న మంత్రి, వారి మోసపూరిత మాటలు నమ్మవద్దని రైతులను కోరారు. బీఆర్ఎస్ మళ్లీ వచ్చేది లేదు, సచ్చేది లేదని అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, లోక్సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీకి కేటీఆర్ లేఖ ప్రచారం కోసం మాత్రమేనని ఎద్దేవా చేశారు.

కేంద్రంలో ఉన్న బీజేపీ ఏనాడూ రుణమాఫీ కోసం మాట కూడా మాట్లాడలేదు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి ఒక ఫ్లాగ్షిప్ స్లోగన్ పెట్టి రైతుల మేలు కోసం ఒక్క అడుగు వేయలేదు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేయడం, గందరగోళ పరిస్థితులను చేస్తున్న విషయాలను యావత్తు తెలంగాణ రైతాంగం గమనించాలని మనవి చేస్తున్నాం. ఆధార్, రేషన్‌కార్డు వివరాలు సరిగా లేని దాదాపు 5 లక్షల మంది అన్నదాతల సమాచారంపై స్పష్టత వచ్చాక వారికి కూడా రుణమాఫీ చేస్తామని భరోసా ఇచ్చారు. వాటిని సవరించడానికి ప్రక్రియ మొదలుపెట్టామని మంత్రి తెలిపారు. ఈ మేరకు ప్రతి మండలంలో మండల వ్యవసాయాధికారులకు బాధ్యతలు అప్పగించామన్నారు. వారు రుణమాఫీ కానీ రైతుల వివరాలను తీసుకొని పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే రుణమాఫీ చేస్తామని వివరించారు. కొన్ని ఖాతాల్లో వివరాలు సరిగా లేకపోవడం, రేషన్‌కార్డులు లేకపోవడం వల్ల రుణమాఫీ జరగలేదని మంత్రి తెలిపారు. మండల వ్యవసాయాధికారులు ఈ సమస్యలను పరిష్కరిస్తారని భరోసా ఇచ్చారు. పదేళ్లలో బీఆర్ఎస్ సర్కార్ రూ.26 వేల కోట్ల రుణమాఫీ చేస్తే, తాము అధికారంలోకి వచ్చిన ఏడునెలల్లోనే రుణమాఫీ కోసం రూ.26 వేల కోట్లు బడ్జెట్ లో పెట్టామని గుర్తుచేశారు. అర్హత ఉన్న ప్రతి కర్షకుడికి కచ్చితంగా ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు



## ప్రతి సమస్యను క్షుణంగా పరిశీలించి పరిష్కరించాలి

- పలు శాఖల అధికారులను ఆదేశించిన కలెక్టర్

**వనపర్తి, విశాల భారతి::** ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించడం పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం ఐ.డి. ఓ.సి ప్రజావాణి హాల్లో అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్ తో కలిసి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 18 ఫిర్యాదులు వచ్చాయి అన్నారు. అనంతరం కలక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించటంలో వేగం పెంచాలని సూచించారు. ఆయా శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను అధికారులకు గుర్తు చేశారు. వచ్చే ప్రజావాణి లోగా ఇప్పుడు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సైదాపూర్ లో రక్షాబంధన్ వేడుకలు



**సైదాపూర్, విశాల భారతి** మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొంత సుధాకర్ మాట్లాడుతూ రక్షాబంధన్ అంటే సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, అనురాగం, ఆప్యాయతకు సంబంధించిన పండగగా రక్షా బంధన్ జరుపుకుంటారు. పురాణాల ప్రకారం ఈ పండుగ కృతయుగం నుంచి ఆచరిస్తున్నారన్నారు. ప్రతీయేటా రక్షా బంధన్ పండుగను శ్రావణ మాసంలోని శుక్లపక్ష పౌర్ణమి రోజున జరుపుకుంటారని చెప్తాను. ఈ రోజున సోదరీమణులు తన సోదరుల చేతి మణికట్టుకు రాఖీలను కడతరని కాదు సోదరులు కూడా సోదరీమణులకు నిత్యం రక్షణగా ఉంటానని హామీ ఇస్తూ, బహుమతి కూడా అందజేస్తారన్నారు.

## రాఖీ పండుగ అందరి బంధాల్లో కొత్త ఆనందం తీసుకురావాలి



**చిగురుమామిడి, విశాల భారతి** తోడపుట్టిన సోదరికి జీవితాంతం కష్ట సుఖాల్లో తోడుంటానని సోదరుడు ఇచ్చే అభయమే రక్షాబంధన్. తరాలు మారినా, యుగాలు గడిచినా వన్నె తరగనిది ఈ రాఖీ పండుగ. అలాంటి రాఖీ పౌర్ణమి వేడుకలు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఘనంగా జరిగాయి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి, ప్రేమాప్యాయతలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను మండల ప్రజలంతా సంతోషల మధ్య జరుపుకున్నారు. నాకు నువ్వు రక్ష నీకు నేను రక్ష మనమంతా ఈ దేశానికి రక్ష అంటూ రాఖీలు కట్టుకున్నారు. ఈ రాఖీ పండుగ అందరి బంధాల్లో కొత్త మాధుర్యాన్ని, జీవితంలో ఆనందం, శ్రేయస్సు తీసుకురావాలని పలువురు ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



## శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా చెక్కులు అందజేత

**ఆర్మూర్, విశాల భారతి** నందిపేట్ మండలంలోని మారంపల్లి గ్రామానికి చెందిన ఆరే సైదయ్య ,ఉమ్మెడ గ్రామానికి చెందిన ఆరేపల్లి చిన్నయ్య, నందిపేట్ గ్రామానికి చెందిన గాండ్ల అంజయ్యలు శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పాలసీ తీసుకోవడం జరిగింది. ఈ పాలసీదారులు ఇటీవల ప్రమాదవశాత్తు, ఆరోగ్య కారణాలవల్ల మరణించగా వారి కుటుంబ సభ్యుల కు కంపెనీ ఈడి శ్రీనివాసరెడ్డి, ఎస్సైలు హరిబాబు, రాహుల్ చేతుల మీదుగా రూ.4,00,000 లక్షలు, 5,80,000 రూపాయలు, 5,75,000 వేల రూపాయలు చెక్కులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై హరిబాబు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఇన్సూరెన్స్ తీసుకోవాలని వాళ్ళ కుటుంబానికి ఒక భరోసాగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేయడం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే చెక్కులు అందించినటువంటి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా ప్రతి వ్యక్తి వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ను ధరించాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాది బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు నాగ సురేష్ , నందిపేట్ ఎంపిటిసిలు రాజు, మురళి, ఏజీఎం సతీష్ కుమార్, డిఎం నాగేష్ , మేనేజర్లు ప్రవీణ్ గౌడ్, అనిల్ గౌడ్ , శ్రీరామ్ ఎంప్లాయిస్ తదితరులు పాల్గొన్నారు.

## మూలమలుపులో ప్రమాదంగా మారిన రహదారి



**చింతపల్లి, విశాల భారతి** చింతపల్లి మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో మెయిన్ రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లేదారిలో పాఠశాల సమీపంలో గ్రామం మూల మలుపులో ప్రమాదంగా మారిన రహదారి ద్విచక్ర వాహనదారులు ఎంతోమంది ప్రమాదానికి గురయ్యామని భయపడిపోతున్న సంఘటన కనిపిస్తుంది. మండల బిజెపి పార్టీ ఉపాధ్యక్షులు వడ్లకొండ మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి పోయేవారు వ్యాపారుల నిమిత్తం వస్తువులు కొనుగోలుదారులు పాఠశాలకు వెళ్లే విద్యార్థులు వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే నిద్ర మేలుకొని ఈ రహదారినీ పునరుద్ధరించి జనజీవనానికి అణువుగా ఉండేలా రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు. తమ గ్రామానికి ఒక్కసారి అయినా అధికారులు వచ్చి తమ పరిస్థితులు అడిగి తెలుసుకున్న నాధుడే లేదు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న వర్షం పడిన రోడ్ల పైన నీళ్లు నిలిచిపోయి, ఉండి ఎక్కడ ఏ గుంత ఉందో తెలియని పరిస్థితి ప్రజా పాలన అధికారి కి గ్రామ సెక్రెటరీ కి పలుమార్లు చెప్పినా కూడా ఇలాంటి స్పందన లేదు అని అంటున్నారు.





## బహుజనులకు బలం..పేదోళ్ల బంధువే నీలం మధన్న సీడీ ఆవిష్కరణ

- నీలం మధుకు రాఖీ కట్టిన ప్రముఖ గాయని మధుప్రియ

**పటాన్ చెరు,విశాలభారతి:** పటాన్ చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని నీలం మధు నివాసంలో సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రముఖ గాయని మధుప్రియ నీలం మధుకు రాఖీ కట్టి శుభ కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మధుప్రియ తనపై రేలరే ప్రసాద్ రచనలో పాడిన బహుజనులకు బలం..పేదోళ్ల బంధువే నీలం మదన్న పాట సీడీని, వీడియోను నీలం మధు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుప్రియకు నీలం మధు చీరను బహుకరించి, శాలువాతో సత్కరించారు. తన కోసం పాట పాడినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

**ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం..**

ఒక్క ఫోటో ఎన్నో జ్ఞాపకాలను పంచుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఇస్నాపూర్ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఫోటోలు మనం సంతోషంగా ఉన్నప్పుడు మధుర జ్ఞాపకాల్ని పంచుకోవడమే కాదు.. మనతో లేనివారి జ్ఞాపకాలు కూడా పంచుతుందన్నారు. ఫోటోగ్రాఫర్లకు అన్ని విధాలుగా సహకరిస్తున్నామని, భవిష్యత్తులో సైతం ఫోటోగ్రాఫర్లకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నరేందర్, ప్రధాన కార్యదర్శి సందీప్, లక్ష్మారెడ్డి, రావి, వీరన్న, శంకర్, నారాయణ రెడ్డి, వెంకటేశ్, మురళీ, శ్రీను, అనిల్, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**మణుగూరు, విశాలభారతి:** ఫోటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 185 వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు సోమవారం నాడు మణుగూరులో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూల మార్కెట్ సెంటర్ నుండి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి స్థానిక అమ్మ, నాన్న వృధాశ్రమం లోని వృద్ధులకు బన్ను, పండ్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ మోహన్ మాట్లాడుతూ జీవితంలో ప్రతి క్షణాన్ని ఒక మధుర జ్ఞాపకంగా చూపించగలిగేది ఒక్క ఫోటో మాత్రమేనని, గడిచిన కాలాన్ని కళ్ళ ఎదుట నిలిపేది ఫోటో అని అన్నారు. ప్రతి ఫోటో గ్రాఫర్ తమ వృత్తిలో పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని మీ వ్యాపారం అభివృద్ధి చేసుకోవాలని అందరం కలిసి కట్టుగా సంఘం నియమాలను పాటిస్తూ సంఘ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గాజుల పూర్ణ చందర్ రావు, అధ్యక్షులు కృష్ణ మోహన్, కార్యదర్శి పుసులూరి శ్రీనివాస్, జిల్లా బాధ్యులు జేమ్స్ , అసోసియేషన్ శాశ్వత సభ్యులు పాల్గొన్నారు.



## ఘనంగా రాఖీ పండుగ సంబరాలు

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య మహిళా సిబ్బంది రాఖీ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక పారిశుద్ధ్య మహిళా కార్మికులు పురపాలక సంఘం చైర్మన్ వెన్ రెడ్డి రాజు గారికి రాఖీ కట్టి రక్షాబంధన్ పండగ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతి ఆడపడుచు తమ కుటుంబ సభ్యునిగా సోదరా భావంగా చైర్మన్ వెన్ రెడ్డి రాజు గారిని భావించి రక్షాబంధన్ కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మహిళా సిబ్బంది మొట్టమొదటిసారిగా తనకు రాఖీలు కట్టినందుకు ఆనందంతో పరవశించిపోయారు. తనను ఒక కుటుంబ సభ్యునిగా వెన్నంటే ఉంటూ తోబుట్టువులుగా మహిళా పరిశోధ సిబ్బంది రక్షాబంధన్ చేయడం అదృష్టంగా భావించానని ఆయన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్,మేనేజర్ లింగయ్య, జవాన్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## సోదర భావానికి ప్రతీకగా జరుపుకునే పండుగ రక్షాబంధన్

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, విశాలభారతి** తమ సోదరీమణులకు ఏ ఆపద రాకుండా ఎల్లవేళలా అండగా నిలబడతామని సోదరులు భరోసా ఇవ్వడమే రాఖీ పండుగ విశిష్టత అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. సోమవారం జిల్లాలోని సంక్షేమ అధికారి కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న బాలసదనం చిన్నారులు కలక్టరెట్ లోని కలక్టర్ చాంబర్ నందు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కు రాఖీ కట్టారు. ఏడవ తరగతి చదువుతున్న అనూష వికలాంగురాలు కలెక్టర్ కు ఆప్యాయంగా రాఖీని కట్టి బాలసదనం చిన్నారులు ఒక్కొక్కరుగా కలెక్టర్ కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాఖీ పండుగను పురస్కరించుకొని,అన్నా చెల్లెల్లు,అక్కా తమ్ముల ఆత్మీయ అనుబంధానికి రక్ష బంధన్ ప్రతీక గా నిలుస్తుందన్నారు. తన సోదరుడు గొప్పగా ఉండాలని, తనకు కొండంత అండగా నిలవాలని ఆకాంక్షిస్తూ సోదరి కట్టే రక్ష ఈ రాఖీ పౌర్ణమి అని కలెక్టర్ తెలిపారు.అనంతరం పిల్లలను ఆశీర్వదించి మిఠాయిలు అందించారు.

ఈ కార్యక్రమంలో డి డబ్ల్యూ వో నరసింహరావు, చేతన్య నాయుడు, పిల్లలు పూజ, అంజలి, ఆధిలక్ష్మి, వర్షిత, నవనీత,సౌమ్య ఆశించిన, మధనశ్రి,రేఖ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**ధర్పల్లి, విశాల భారతి** రాఖీ పౌర్ణమి అనగానే అన్నా చెల్లెల అనుబంధం గుర్తుకొస్తుంది. ఇలాంటి రాఖీ పండగ ధర్పల్లి మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షుడు పాము నారాయణ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రాఖీ పండగ ఘనంగా జరపామని, మొదటగా మార్కండేయన్ని పూజించి యజ్ఞోమాలు చేసి అనంతరం కొత్త జంజీరాలు ధరించి రాఖీ కట్టుకున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు జక్కుల గంగాధర్, ఉపాధ్యక్షులు దువ్వ భూమేశ్వర్, ప్రధాన కార్యదర్శి క్యాదరి నారాయణ,కోశాధికారి అంకం. ఆనంద్, ఉప కార్యదర్శి ఇంజాపురం మహేందర్, కార్యవర్గ సభ్యులు బిల్ల పురుషోత్తం, లోకం విష్ణుదాస్, చాట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.



## నమస్తే తెలంగాణ ఫోటోగ్రాఫర్ సైదిరెడ్డికి రాష్ట్రస్థాయి అవార్డులు

**సూర్యాపేట, విశాలభారతి** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోటోగ్రఫీ కాంపిటీషన్ లో సూర్యాపేట జిల్లా నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫోటోగ్రాఫర్ పి. సైదిరెడ్డి సోమవారం హైదరాబాదులోని గ్రీన్ పార్క్ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ హనుమంతరావు చేతులమీదుగా అందుకున్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోటోగ్రఫీ కాంపిటీషన్ లో సూర్యాపేట జిల్లా నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫోటోగ్రాఫర్ నాలుగవ కేటగిరిలో గృహాజ్యోతి పథకానికి సంబంధించిన చిత్రానికి మొదటి అవార్డు రాగా, మొదటి కేటగిరీలో మహాలక్ష్మి పథకంపై తీసిన చిత్రానికి ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహ జ్యోతి పథకానికి సంబంధించి జర్నలిస్టు సైదిరెడ్డి తీసిన చిత్రం ఉత్తమ చిత్రంగా మొదటి అవార్డు గెలుచుకోవడం అభినందనీయమన్నారు. అలాగే మరో పథకం మహాలక్ష్మి పథకంకు ఫోటో జర్నలిస్టు పి. సైదిరెడ్డి ప్రోత్సాహక బహుమతి అందుకోవడం గర్వనీయమన్నారు. ఈ సందర్భంగా సైదిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తరపున రాష్ట్రస్థాయి రెండు అవార్డులు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డును కుటుంబ సభ్యులతో కలిసి తీసుకోవడంచాలా సంతోషంగా ఉందన్నారు.

## సిరి సంపద తాత్కాలికమే.. ప్రేమాభిమానాలు అంతిమం

- మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి



**వనపర్తి, విశాల భారతి::** రాఖీ పండుగ సందర్భంగా సోదరి విజయలక్ష్మి.. రావుల చంద్రశేఖరరెడ్డికి రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ పార్లమెంటు సభ్యులు రావుల చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. అన్నకు చెల్లిరక్ష చెల్లికి అన్నరక్ష అని సమాజములో ఎన్నో వ్యవహారిక బంధాలు ఉన్న అత్యంత అనుబంధం తోబుట్టువులది అని.. అనుక్షణం సోదరుల సంక్షేమం కోరుకునేది మాత్రం అక్కాచెల్లెళ్ళు మాత్రమే అన్నారు. సిరిసంపదలు తాత్కాలికమేనని అనుబంధాలు ఆత్మీయతలు మాత్రమే శాశ్వతం అని అన్నారు. మనవెంట వచ్చేవి మంచి చెడు మాత్రమే అని గుర్తెరిగిన నాడు మానవ మనుగడకు సార్థకత చేకూరుతుంది అని మనం చూపిన ఆత్మీయత,చేసిన పనులు శాశ్వతంగా నిలిచిపోతాయి అని అన్నారు.మరోసారి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## సోదరీమణులకు రక్షణగా నిలిచే బంధమే రక్షాబంధన్

■ కొప్పిశెట్టి దినేష్ కుమార్

**కూకట్ పల్లి, విశాలభారతి** సోదర సోదరీమణుల మధ్య అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి దేశమంతా ఘనంగా జరుపుకుంటారని కొప్పిశెట్టి దినేష్ అన్నారు. ఒకప్పుడు ఉత్తర, పశ్చిమ భారతదేశాలలోని ప్రజలు మాత్రమే అపూర్వంగా జరుపుకునే ఈ పండుగను ఇప్పుడు దేశవ్యాప్తంగా చాలా ఘనంగా జరుపుకుంటున్నారని ఆయన అన్నారు. సోదరి తన సోదరుడు మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ రాఖీ కట్టి ఎప్పుడూ సోదరుడు,సోదరికి అండగా ఉంటుందని ఈ బంధం చెప్తోంది. సోదరి కట్టిన రక్షాబంధనాన్ని స్వీకరించిన సోదరుడు తానెప్పుడూ సోదరి కి రక్షగా ఉంటానని ఈ పండుగ ద్వారా తెలియజేస్తారని అన్నారు. శ్రావణ పౌర్ణమి రోజున మంచి మనసు, నిండుహృదయంతో పవిత్రమైన



రక్షాబంధనాన్ని కట్టిన నా ఆత్మీయ సోదరీమణులు అందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా రాఖీవేడుకలు

**కూకట్ పల్లి, విశాలభారతి:** రాఖీ పౌర్ణమి పండుగని పురస్కరించుకొని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి సంబంధించిన మహిళలు సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు రాఖీ కట్టారు.. ముందుగా మాధవరం కృష్ణారావు సోదరిమణి రమాదేవి రాఖీ కట్టి సోదరుడిని ఆశీర్వదించారు. అనంతరం రాఖీ పౌర్ణమి వేడుకలు క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వచ్చిన సోదరీమణులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చీరలు కానుక అందించారు.. సోదర సోదరీమణుల ఆప్యాయతను తెలియచెప్పే పండుగ రాఖీపూర్ణిమనీ ఈ సందర్భంగా ప్రతి ఆడపడుచు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు..

## రుణమాఫీ పై ప్రతిపక్షాలు మాట్లాడే నైతిక హక్కు లేదు

- రూ.2లక్షలు ఒకేసారి మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదే
- డిసిసిబి డైరెక్టర్,తొర్రూరు పిఎస్ఎస్ చైర్మన్ హరి ప్రసాద్



**తొర్రూరు, విశాలభారతి:** ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేశారని,రుణమాఫీపై బిఆర్ఎస్ పార్టీలు మాట్లాడే నైతిక అర్హత లేదని వరంగల్ డిసిసిబి డైరెక్టర్,తొర్రూరు పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ విమర్శించారు. సోమవారం పిఎసిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తామని మాయమాటలు చెప్పి మోసం చేశారని, ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలలో రూ.లక్షలు ఒకేసారి రుణమాఫీ చేశాడని,రైతుల కళ్ళలో ఆనందం చూడడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతిపక్షాలు రుణమాఫీపై దుష్ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు.తాను 2020 లో పిఇసిఎస్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టి సొసైటీ అభివృద్ధికి కృషి చేశానని, గోదాం ఏర్పాటు చేసి 26 ప్యాడి సెంటర్ లు ఏర్పాటు చేసినాడు తెలిపారు. అప్పటి కలెక్టర్ గౌతమ్ సహకారంతో ఎకరం ప్రభుత్వ భూమిలో భవనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో రైస్ మిల్లు,పెట్రోల్ బంకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.తొర్రూరు డిసిసిబి బ్యాంక్ లో రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఎల్ టి లోన్స్ నుండి క్రాప్స్ లోన్ గా రైతులకు న్యాయం చేశామన్నారు. సమావేశంలో సిబ్బంది వెలుగు సంతోష్, ఎన్. యాకయ్య, పి.శ్రీకాంత్, కె.అనిల్, ఆర్. నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**శాలిగౌరారం, విశాలభారతి:**సోదరి సోదరులకు ప్రేమ, ఆప్యాయతలకు అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రక్షాబందన్ పండుగను సోమవారం శాలిగౌరారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టి తమ ప్రేమ అనుబంధాన్ని చాటుకున్నారు. ప్రతి ఇల్లు ఆడపడచుల రాకతో సందడిగా కనిపించింది. శాలిగౌరారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు డెంకల సత్యనారాయణకు అయన ఇద్దరు సోదరీలు రాఖీ కట్టి తమ అనుబంధాన్ని పంచుకున్నారు. మండలం కేంద్రంలో రాఖీ విక్రయ కేంద్రాలు, వస్త్ర దుకాణాలు స్వీట్ షాప్ లు సందడిగా కనిపించాయి.

## రైతు రుణమాఫీపై అన్ని మండలాల్లో ప్రజావాణి

■ జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

**కొత్తగూడెం, విశాలభారతి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా 12 డిసెంబర్ 2018 నుండి, ఆగస్టు 15 2024 వరకు రైతులు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారిలో రుణమాఫీ కానీ వారు దరఖాస్తు చేసుకోవాలని, జిల్లాలోని 23 మండలాల్లో వ్యవసాయ అధికారులు మంగళవారం 20 ఆగస్టు 2024 నుండి 30 ఆగస్టు 2024 వరకు రైతు రుణమాఫీ పై ప్రజావాణి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు రైతు రుణమాఫీ కానీ రైతులందరూ తమ తమ మండలాల్లోని వ్యవసాయ అధికారులను (ఏ.O) కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలి అని తెలిపారు. జిల్లాలోని అర్హత కలిగిన రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చెల్లిస్తుందని. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం రైతులకు కల్పించిన ఈ సదావకాశాన్ని అర్హులైన రైతులందరూ సద్వినియోగపరుచుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఏదేని సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కానీ రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ దరఖాస్తులను వ్యవసాయ శాఖ సంబంధిత పోర్టల్ లో ఆన్లైన్ చేస్తామని తెలిపారు.








## రామన్న, హరీశన్నకు రాఖీలు కట్టిన కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

**పటాన్ చెరు, విశాలభారతి:**రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుకు భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి రాఖీలు కట్టారు. హైదరాబాదులోని హరీష్ రావు నివాసంలో, తెలంగాణ భవన్ లో కేటీఆర్ ను కలిసి కార్పొరేటర్ సింధు వారిని రాఖీలు కట్టి వారి ఆశీస్సులు తీసుకున్నారు, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తనకు ఎల్లవేళలా రక్షకులుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాఖీలు కట్టి ఆప్యాయత చాటుకున్న కార్పొరేటర్ సింధును మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు రాఖి పండుగా శుభాకాంక్షలు తెలిపారు. సుఖ సంతోషాలతో ఉండాలని ఆశీర్వాదాలు అందజేశారు.




## స్టాన్లీ కాలేజ్ లో ఘనంగా ఓరియెంటెషన్ డే

- విద్యార్థులకు జ్ఞానంతో పాటుగా సాంకేతిక నైపుణ్యాలు అవసరం
- విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవాలి
- హేమలత
- సబ్జెక్టుపై పరిజ్ఞానం అవసరం
- జి.శ్రీ రామ్

**సికింద్రాబాద్, విశాలభారతి:**స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ వుమెన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఓరియంటేషన్ డే కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థుల కొరకు ఓరియంటేషన్ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హేమలత , హెచ్ పి ఈ సీనియర్ హెచ్.ఆర్ మేనేజర్ , జి శ్రీ రామ్, టీ టెక్, సీనియర్ హెచ్.ఆర్ మేనేజర్ , ఐజాజ్ , సీఈఓ, టాలెంట్ ట్రైనింగ్ హాజరయ్యారు. స్టాన్లీ కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ కే. కృష్ణారావు మేనేజ్మెంట్ సభ్యులు టి.రాకేష్ రెడ్డి , ఆర్ .ప్రదీప్ రెడ్డి , కళాశాల డీన్, అకడమిక్స్ ప్రొఫెసర్ ఏ.వినయ్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్ లంక , డైరెక్టర్ డా. వి అనురాధ , ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి , మరియు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఏ రమేష్, పాల్గొన్నారు. ఓరియంటేషన్ కార్యక్రమానికి డాక్టర్ వి అనురాధ అధ్యక్షత వహించారు ముఖ్య అతిథిగా హాజరైన హేమలత మాట్లాడుతూ నేడు విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని చెప్పారు. జ్ఞానంతో పాటు సాంకేతిక నైపుణ్యాలు ముఖ్యమని తెలియజేశారు. నేడు అనేక కంపెనీలు, పరిశ్రమలు సాంకేతిక నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు. ప్రొఫెషనల్ విద్య గతంలో చదివిన ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కంటే భిన్నంగా ఉంటుందని ఈ విద్యా విధానానికి అలవాటు పడాలని గుర్తు చేశారు. భట్టీ పట్టే విధానానికి స్వస్తి చెప్పి విషయాలను అర్థం చేసుకొని జ్ఞనార్జన చేయాలని కోరారు. మరొక ముఖ్య వక్తగా హాజరైన జి శ్రీ రామ్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ పద్ధతిని అనుసరించి విషయాలను చూడాలని చెప్పారు. కేవలం మార్కుల కోసమే కాకుండా జ్ఞానం కోసము సబ్జెక్టును చదవాలని మరియు చదివిన విషయాలను అర్థం చేసుకోవాలని సూచించారు. ఒక దేశం యొక్క అభివృద్ధి ఆ దేశంలో ఉన్న విద్యార్థులు, యువతీ యువకుల పైన ఉంటుందని తెలిపారు. విద్యార్థులు తాము నేర్చుకున్న శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలను సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించాలని కోరారు. నేర్చుకున్న అంశాలను వ్యక్తం చేయడానికి మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి మొదటి సంవత్సరం నుంచే కృషి చేయాలని అన్నారు. ఇంజనీరింగ్ నందు అన్ని కోర్సులు సమానమేనని, విద్యార్థులు కేవలము ఆ కోర్సు కు సంబంధించిన సంపూర్ణమైన జ్ఞానాన్ని పెంపొందించుకునే విషయం పట్ల దృష్టి సారించాలని చెప్పారు. జ్ఞానముతో పాటు మంచి నైపుణ్యాన్ని సాధించినట్లయితే ప్రాంగణ నియామకాల లో ఉత్తీర్ణులు అవ్వడం సులభమని గుర్తు చేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి ఇంజనీర్లను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు డాక్టర్ వి.అనురాధ పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన తీజ్ సంబరాలు

- బంజారాల సంప్రదాయానికి ప్రత్యేక తీజ్
- లంబాడి ఐక్యవేదిక డోర్నకల్ అసెంబ్లీ ఇంచార్జ్
- బానోతు ప్రవీణ్ నాయక్

**మరిపెడ, విశాలభారతి:** ఎలమంచి తండాలో బంజారాల సంప్రదాయక ప్రతికైనా తీజ్ పండుగను ఎలమంచిలి తండాలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మరిపెడ మండల కేంద్రంలోని ఎలమంచిలి తండలో తీజ్ ను గంగమ్మ ఒడిలోకి నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు బానోత్ ప్రవీణ్ నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బానోత్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ పండుగ తొమ్మిది రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి. తొమ్మిదో రోజు నిమజ్జనం చేస్తారని తెలిపారు. ఈ తీజ్ పండుగను పెళ్లి కానీ గిరిజన యువతులు ఘనంగా నిర్వహిస్తారని బంజారాల సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేక పండుగ తీజ్ అని అన్నారు.



## బంజారా నగర్ లో అన్నదానం

**తొర్రూరు, విశాలభారతి:** మున్సిపాలిటీలోని 5వ వార్డులోని బంజారా నగర్ లో తీజ్ పండగ వేడుకల సందర్భంగా ధర్మ శ్రీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ధారావత్ విమల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ ధరావత్ సునిత జైసింగ్ తో కలిసి విమల అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్నదానం చాలా గొప్పది అన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మా శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి కృష్ణ, అన్నదాతలు జగదీష్, దినేష్, సుధీర్, జయపాల్, శ్రీనివాస్, స్థానికులు గణేష్, బాలాజీ, ప్రశాంత్, దేవేందర్, దేవు, చందా నాయక్, ప్రవీణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ

■ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:**సోదరీ సోదరుల మధ్య అనురాగాలకు, ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి నివాసంలో ఆయన సోదరీమణులు రాఖీ కట్టారు. రాఖీ పండగ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. మహిళలను గౌరవించుకోవడం మన సంస్కృతి అని అన్నారు. ప్రతి అడపడుచు, అన్నదమ్ములతో ఎంతో ఉత్సాహాన్ని, ఆనందాన్ని పంచుకునే పండగ రాఖీ పండగ అని అన్నారు. సోదరులు అందరూ బాగుండాలని ప్రతి ఆడబిడ్డ కోరుకుంటుందని తెలిపారు.



## గణేష్ దేవాలయంలో మహా కుంభభిషేకం

**విశాలభారతి,కంటోన్మెంట్:**కంటోన్మెంట్ నియోజకవర్గంలోనే పేరుగాంచిన దేవాలయం గణపతి దేవాలయం.దేవాలయం 200 సందర్భంగా మహా కుంభాభిషేకం పేరుతో ప్రత్యేకంను నిర్వహించారు. ఈ మహా కుంభాభిషేకం కార్యక్రమంకు స్థానిక కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మహా కుంభాభిషేకం లో పాల్గొనడం తన అదృష్టమని తెలిపారు. భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలకు ఉండాలని , అందరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థించారు. దేవాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేకం పూజల్లో పాల్గొని, స్వామికి మొక్కులు చెల్లించారు. అంతకు ముందు దేవాలయ నిర్వాహకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు .ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సత్యనారాయణ, సదానంద గౌడ్, అశోక్, వినోద్, శ్రీశైలం,బద్రీనాథ్ యాదవ్, తేజ్పాల్, ఆర్డి నగే నగేష్ యాదవ్, సంతోష్ యాదవ్, ఆలయ అర్చకులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మా జాతిలో పుట్టి మాకే ద్రోహం చేస్తే ఎలా..!

- బీసీ కుల గుల్లకు గోపురాలకు దళితుల భూములే కావాలా
- మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ నాయకుడు-గుగ్గిళ్ళ పీరయ్య

**డోర్నకల్, విశాలభారతి:** దంతాలపల్లి మండలం నిదానపురం గ్రామంలో దళితులు అయినా ఎస్సీ మాదిగలతో మాదిగ మహిళలతో పూర్వం వెట్టి చాకిరి చేపించుకొని దొరలకు ఊడిగం చేసేవారు. కుమ్మరి కుంట్ల దొరలు తమ సొంత భూమిని మూడు ఎకరాల 24 గంటలు దానధత్వంగా దళితులకు ఇచ్చారు. అట్టి భూమిని దళితుల్లో కొందరు దళార్లు, బిసి వర్గాలతో కుమ్మక్కై కబ్జా చేయాలని ఆ భూముల్లో బీసీ కులాలకు గుడి గోపురాలు కట్టాలని రాజకీయాలు చేస్తు మాజీ సర్పంచ్ ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని చూస్తున్నారని వారన్నారు. భూములను లాక్కోవాలని అక్రమంగా వారిపై దాడులు చేస్తూ పోలీస్ స్టేషన్లో కేసులు పెడుతూ అమాయకులైన మాదిగలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిని సహించేది లేదని మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ నాయకుడు గుగ్గిళ్ళ పీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం నిదానపురం గ్రామంలో దళితుల భూమిని సందర్శించి ఆ భూమిని ఆక్రమించుకున్న విధానాన్ని చూసి చెలించిన జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య ,వారి భూములను కొంతమంది అదే కులానికి చెందిన దళారులు బీసీలకు కొమ్ము కాస్తూ దళితుల భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని అన్నారు. దళితుల భూమి జోలికి వస్తే రణరంగమేనని మందకృష్ణ మాదిగా నాయకత్వంలో అనేక ఉద్యమాలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. మన వాడు మోసం చేస్తే మన ఇంటి ముందే పాతిపెడదాం పరాయివాడు మోసం చేస్తే పొలిమర దాటేవరకు తన్ని తరమాలని కాళోజి నారాయణరావు చెప్పిన సూక్తిని తెలియజేస్తూ దళితుల జోలికి వస్తే సహించేది లేదని దళితుల భూముల జోలికొస్తే ఊరుకునేది లేదని అవసరమైతే కలెక్టర్ ని కూడా కలుస్తామని ఇక్కడున్న ఎస్ఐ కూడా అక్రమంగా కేసులు పెడితే సహించబోమని సరి అయిన విచారణ జరిపించి కేసుల్లో ముందుకు పోవాలి గాని అక్రమంగా వన్ సైడ్ కేసులు పెడితే సహించబోమని మాదిగ వర్గాలను కూడా ఏకం చేసి జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చాగంటి రమేష్ ప్రధాన కార్యదర్శి ఇరుగు రవి, రజియా, వంగూరి వెంకటేశ్వర్లు ,చేలగళ్ల వెంకన్న, కందిపాటి భిక్షం, రామరాజు, పద్మ , సుమిత్ర, మధు, వెంకన్న , నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com

vishalabharathi Telugu Daily
మంగళవారం,
20.08.2024
హైదరాబాద్




# అల్లు అర్జున్ ముఖ్య అతిథిగా 'మారుతి నగర్ సుబ్రమణ్యం' ప్రీ రిలీజ్ ఈవెంట్




క్రియేటివ్ జీనియస్ సుకుమార్ భార్య తబిత సమర్పణలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న సినిమా 'మారుతీ నగర్ సుబ్రమణ్యం'. రావు రమేష్ కథానాయకుడిగా రూపొందిన చిత్రమిది. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలపై బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. రావు రమేష్ సరసన ఇంద్రజ... అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి మరో జంటగా, హర్షవర్ధన్ కీలక పాత్రలో నటించారు. ఆగస్టు 23న సినిమా విడుదల కానుంది. ఈ బుధవారం సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ముఖ్య అతిథిగా ఆగస్టు 21న హైదరాబాద్‌లో 'మారుతి నగర్ సుబ్రమణ్యం' ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. ఇప్పటికే 'మారుతి నగర్ సుబ్రమణ్యం'ను సుకుమార్, తబిత దంపతులు చూశారు. వినోదంతో పాటు చక్కటి కుటుంబ విలువలతో తెరకెక్కిన ఈ సినిమా విపరీతంగా నచ్చడంతో తన సమర్పణలో విడుదల చేయడానికి తబిత ముందుకు వచ్చారు. 'మారుతి నగర్ సుబ్రమణ్యం'లో రావు రమేష్, అంకిత్ కొయ్య తండ్రి కుమారుల పాత్రలు చేశారు. రావు రమేష్ తన తండ్రి కాదని, తాను అల్లు కుటుంబంలో పుట్టానని, అల్లు అరవింద్ తన తండ్రి అల్లు అర్జున్ తన అన్నయ్య అనుకునే క్యారెక్టర్ చేశారు అంకిత్ కొయ్య. ప్రేమించిన అమ్మాయిని ఊహించుకుంటూ పాడుకునే పాటల్లోనూ అల్లు అర్జున్ సినిమాల్లో సూపర్ హిట్ సాంగ్స్ రీ క్రియేషన్ చేశారు.


## సూపర్‌స్టార్ రజినీకాంత్ భారీ బడ్జెట్ మూవీ

# 'వేట్టైయాన్'..




సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా భారీ బడ్జెట్ చిత్రాలను రూపొందిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోన్న ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'వేట్టైయాన్'. ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్ 10న భారీ ఎత్తున విడుదల చేస్తున్నారు. సామాజిక పరమైన సమస్యలను తెలియజేసేలా సినిమాలు చేస్తూ విమర్శకుల ప్రశంసలను అందుకున్న దర్శకుడు టి.జె.జ్ఞానవేల్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ కాంబోలో రాబోతున్న ఈ పాన్ ఇండియ మూవీ ప్రతిష్టాత్మకంగా రూపొందుతోంది. బ్లాక్ బస్టర్ చిత్రాలు 2.0, దర్బార్, లాల్ సలామ్ వంటి చిత్రాల తర్వాత రజినీకాంత్, లైకా ప్రొడక్షన్స్ కలయికలో రాబోతున్న నాలుగో సినిమా 'వేట్టైయాన్'. అలాగే పేట, దర్బార్, జైలర్ చిత్రాల తర్వాత రజినీకాంత్, రాక్ స్టార్ అనిరుద్ రవిచందర్ కలయికలోనూ రానున్న నాలుగో సినిమా కూడా ఇదే కావటం విశేషం. 'వేట్టైయాన్' చిత్రంలో భారీతారాణం కూడా నటిస్తుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆసక్తికరమైన విషయమేమంటే అంధాకానూన్, గిరఫ్తార్, హమ్ సినిమాల తర్వాత రజినీకాంత్, అమితాబ్ కలిసి నటిస్తోన్న నాలుగో సినిమా ఇది. ఇంకా ఈ చిత్రంలో మంజు వారియర్, ఫహాద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, రితికా సింగ్, దుషరా విజయన్, రోహిణి, అభిరామి తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ హెడ్ జికెఎం. తమిళ్ కుమరన్ ఆధ్వర్యంలో వేట్టైయాన్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆడియెన్స్‌కు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను ఇవ్వటానికి సిద్ధమవుతోన్న ఈ పాన్ ఇండియా సినిమా తమిళ, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది.

# 'మెకానిక్ రాకీ' డబ్బింగ్ ప్రారంభం



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తన అప్ కమింగ్ మూవీ 'మెకానిక్ రాకీ'తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమౌతున్నారు. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్ టైనర్ గా రూపొందించారు. ఈ చిత్రానికి రవితేజ ముళ్లపూడి రచన, దర్శకత్వం వహించారు. ప్రముఖ నిర్మాత రామ్ తాళ్లూరి తన SRT ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మించారు. సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గేర్, ఫస్ట్ సింగల్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు సినిమా డబ్బింగ్ స్టార్ట్ అయ్యింది. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్స్ గా నటిస్తున్న ఈ చిత్రానికి జెక్స్ బిజోయ్ మ్యూజిక్ అందిస్తున్నారు.మనోజ్ కటసాని సినిమాటోగ్రఫీ. అన్వర్ అలీ ఎడిటర్, క్రాంతి ప్రియం ప్రొడక్షన్ డిజైనర్. సత్యం రాజేష్, విద్యాసాగర్ జె ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు. మెకానిక్ రాకీ అక్టోబర్ 31న దీపావళికి విడుదల కానుంది.



# కొత్త రకం డ్రెస్సులో అనసూయ..

అనసూయ భరద్వాజ్, తెలుగు టెలివిజన్ రంగంలో ఓ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న యాంకర్. అనసూయ కెరీర్ ప్రారంభం ఒక న్యూస్ రీడర్‌గా అయినప్పటికీ, జబర్దస్త్ కామెడీ షోలో యాంకర్‌గా చక్కని గుర్తింపు పొందింది. ఆ షో ద్వారా ఆమెకు వచ్చిన క్రేజ్, ఆమెను బుల్లితెర మీద స్టార్ యాంకర్‌గా నిలబెట్టింది. ఆ తర్వాత అనసూయ వెనక్కి తిరిగి చూడకుండా, తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగించింది. అనసూయ సినిమా రంగంలోకి అడుగుపెట్టడం కూడా విశేషమే. మొదట క్షణం సినిమాతో వెండితెరపై ఒక డిఫరెంట్ యాక్టింగ్ తో ఆకట్టుకుంది. తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కానీ, ఆమెకు భారీ గుర్తింపు తెచ్చిన సినిమా మాత్రం రామ్ చరణ్ నటించిన రంగస్థలం. ఆ సినిమాలో అనసూయ నటన ప్రేక్షకులను, విమర్శకులను ముగ్ధులను చేసింది. ఆ సినిమాతోనే అనసూయ ఓ స్టార్ యాక్టర్‌గా పేరు సంపాదించుకుంది. రంగస్థలం తర్వాత అనసూయ సినిమాల ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరించింది. పుష్ప సినిమాలో కీలక పాత్ర పోషించిన ఆమె, ఆ సినిమా సీక్వెల్ అయిన పుష్ప ది రూల్‌లో కూడా తన పాత్రను పునరావృతం చేయనుంది. ఈ క్రమంలో అనసూయ ఇతర భాషలలో కూడా మంచి అవకాశాలు అందుకోవడం విశేషం. అనసూయ తన పాత్రలు, సినిమాల ఎంపికలో తనదైన స్టైల్లో దూసుకుపోతూ నటిగా మంచి గుర్తింపు పొందుతోంది. అనసూయ సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ముఖ్యంగా తన ఇన్స్టాగ్రామ్‌లో అప్డేట్స్ రెగ్యులర్‌గా పంచుకుంటుంది. తన ఫ్యామిలీతో వెకేషన్‌కు వెళ్ళినప్పడల్లా, ఆ ఫోటోలను తన అభిమానులతో షేర్ చేస్తుంది. ఇక అనసూయ నిండుగా ఉన్న ఒక డిఫరెంట్ డ్రెస్సులో దర్శనమిచ్చిన విధానం వైరల్ అవుతోంది. ఈ ఫోటోలు అనసూయ అందాన్ని కొత్తగా హైలైట్ చేస్తున్నాయి. ఈ ఫోటోలలో ఆమె లుక్స్ అభిమానులను ఆశ్చర్యపరిచేలా ఉన్నాయి. అనసూయ హెల్దీ కాంప్లిమెంట్స్, అందానికి సంబంధించిన కామెంట్స్, ఆమె ఫోటోలను వైరల్‌గా మార్చాయి. ప్రస్తుతం అనసూయ పుష్ప 2తో పాటు, మరో రెండు సినిమాలు, కొన్ని వెబ్ సిరీస్‌లలో బిజీగా ఉంది.

# మారుతి నగర్ సుబ్రహ్మణ్యం'లో నా క్యారెక్టర్ ప్రేక్షకుల్ని నవ్విస్తుంది

**రమ్య పసుపులేటి**

రావు రమేష్, ఇంద్రజ జంటగా నటించిన సినిమా 'మారుతీ నగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. ఇందులో రావు రమేష్ కుమారుడిగా అంకిత్ కొయ్య, అతని సరసన రమ్య పసుపులేటి నటించారు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలపై బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. క్రియేటివ్ జీనియస్ సుకుమార్ భార్య తబిత సమర్పణలో ఈ శుక్రవారం సినిమా విడుదల అవుతోంది. ఈ సందర్భంగా రమ్య పసుపులేటి మీడియాతో మాట్లాడారు. ఆవిడ చెప్పిన విశేషాలు...

**రమ్య గారు... మీ గురించి చెప్పండి!**

నాకు నాలుగైదేళ్ల వయసు ఉన్నప్పటి నుంచి యాడ్స్ చేస్తున్నాను. అనుష్క గారి 'పంచాక్షరీ'లో బాలనటిగా చేశా. సూపర్ స్టార్ మహేష్ బాబు గారి 'స్పైడర్'లోనూ ఓ రోల్ చేశా. ఆ తర్వాత చదువుకోవాలని గ్యాప్ తీసుకున్నాను. బ్యాచిలర్స్ ఫినిష్ చేసి సినిమాల్లోకి వచ్చాను. ప్రజలకు రీచ్ అవ్వడానికి ఇన్‌స్టాగ్రామ్ హెల్ప్ అయ్యింది.

**'మారుతీ నగర్ సుబ్రమణ్యం'లో మీకు అవకాశం ఎలా వచ్చింది?**

దర్శకుడు లక్ష్మణ్ కార్య గారు నన్ను ఇన్‌స్టాగ్రామ్‌లో చూశారట. ఈ అమ్మాయిని పిలవండి, ఆడిషన్ చేద్దామని టీమ్ మెంబర్లతో చెప్పారట. ఆఫీసుకు వెళ్లాక ఆడిషన్ చేశారు. నా పెర్ఫార్మన్స్ నచ్చడంతో ఎంపిక చేశారు. చాలా రోజుల తర్వాత మంచి అవకాశం రావడంతో హ్యాపీగా ఫీలయ్యాను.

**కథలో మిమ్మల్ని ఆకట్టుకున్న అంశాలు ఏమిటి?**

నవ్వించడం కష్టం. ప్రేక్షకుల్ని నవ్వించగలిగితే క్యారెక్టర్ పండినట్టు. ఇందులో నా పాత్ర ద్వారా నవ్వించే అవకాశం వచ్చింది. సినిమా చూసిన వాళ్లు అందరికీ నా రోల్ నచ్చుతుంది.

**'మారుతి నగర్ సుబ్రమణ్యం' ట్రైలర్ చూస్తే గ్లామర్, ట్రెడిషనల్... రెండు విధాలుగా కనిపిస్తున్నారు!**

'మేడమ్ సార్ మేడమ్' సాంగ్ చూస్తే... నన్ను అన్ని విధాలుగా చూపించారు. నేను 18 ఇయర్స్ ఓల్డ్ అమ్మాయి రోల్ చేశా. క్యూట్ అండ్ క్రింజ్ లవ్ స్టోరీ ఉంటుంది. గ్లామర్, ట్రెడిషనల్... రెండు విధాలుగా కనిపిస్తా.

**మీ క్యారెక్టర్ ఎలా ఉంటుంది?**

బబ్లీ, క్యూట్ అండ్ ఇన్నోసెంట్ అమ్మాయి. కొంచెం తింగరితనం ఉంటుంది. కానీ, చాలా నవ్విస్తా. నాకు కామెడీ చేయడం చాలా ఇష్టం. ఎమోషన్స్ కూడా బాగా చేస్తా.

**అంకిత్ కొయ్యతో మీ వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్?**


వెరీ అమేజింగ్ కో యాక్టర్. వ్యక్తిగతంగా మనిషికి హెల్ప్ చేసే పర్సనాలిటీ. నటుడిగా ఎలా చేస్తాడో 'ఆయ్'లో చూశాం. వండర్ ఫుల్ యాక్టర్. మా ఇద్దరి మధ్య సన్నివేశాలు చాలా బావుంటాయి.

**'మేడమ్ సార్ మేడమ్' పాటకు ఈ స్థాయిలో రెస్పాన్స్ వస్తుందని ఊహించారా?**

అవును... ముందు ఊహించాను. మా దర్శకుడు లక్ష్మణ్ కార్య ట్యూన్ వినిపించారు. పాట వినిపించమంటే... విడుదల అయ్యే ముందు రోజు వరకు చూపించలేదు. ఆ పాట ట్యూన్ విన్నప్పుడు నచ్చింది. సిద్ శ్రీరామ్ పాడుతున్నారని తెలిశాక పెద్ద హిట్ అవుతుందని అనుకున్నాను.

**రావు రమేష్, ఇంద్రజ వంటి సీనియర్లతో స్క్రీన్ షేర్ చేసుకోవడం ఎలా అనిపించింది?**

మొదట భయం వేసింది. నేను కంఫర్టబుల్‌గా ఉండేలా వాళ్ళు చూసుకున్నారు. ఓ రోజు సీన్ అయ్యాక రావు రమేష్ గారు 'బాగా చేశావమ్మా' అన్నారు. ఆ తర్వాత నాకు కాన్ఫిడెన్స్ వచ్చింది. ఇంద్రజ గారు ఎక్కువ స్క్రీన్ స్పేస్ లేదు. ఆవిడ చాలా ప్రెట్టిగా ఉంటారు. వెరీ నైస్ హ్యూమన్ బీయింగ్.



# క్రేజీ పాన్ ఇండియా ఫిల్మ్ 'కన్నప్ప' నుండి కంపడు, గవ్వరాజు క్యారెక్టర్స్ లుక్స్ విడుదల



డైనమిక్ హీరో విష్ణు మంచు అత్యంత ప్రతిష్టాత్మక పాన్ ఇండియా డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' మూవీ ప్రమోషన్స్ అప్డేట్స్‌ను అగ్రెసివ్‌గా చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రతి సోమవారం చిత్రం నుంచి ముఖ్యమైన అప్డేట్ ను ప్రకటిస్తున్నారు. సినిమాలో కీలకమైన, విభిన్నమైన పాత్రలను పోషిస్తున్న దిగ్గజ నటీనటుల లుక్స్‌కు సంబంధించిన పోస్టర్స్ విడుదల చేస్తూ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి మధుబాల,శరత్‌కుమార్, దేవరాజ్ వంటి ప్రముఖ నటులు పోషిస్తున్న పాత్రలకు పరిచయం చేస్తూ, వారి పాత్రలకు సంబంధించిన పోస్టర్‌లను విడుదల చేస్తూ సినిమా పట్ల అంచనాలను పెంచుతున్నారు. తాజాగా ఈ చిత్రంలో ప్రముఖ నటుడు ముఖేష్ రుషి పోషిస్తున్న పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌తో పాటు మరో ప్రముఖ నటుడు బ్రహ్మాజీ పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. కంపడు పాత్రలో ముఖేష్ రిషి, గవ్వరాజుగా బ్రహ్మాజీ ఈ చిత్రంలో కనిపించనున్నారు. వారు అత్యంత పురాతన పుళిందుల జాతికి చెందిన అత్యంత భయంకరమైన తెగకు చెందినవారు. సదాశివ కొండలలో జన్మించిన వీరిని భద్రగణం అని కూడా అంటారు. వారు 'వాయులింగానికి వంశపారంపర్య సేవకులు మరియు రక్షకులు. కంపడు నాయకుడు మరియు భద్రగణాన్ని నడిపిస్తాడు. ఈ వంశం త్రిశూలాలను ఉపయోగించడంలో ప్రత్యేకత కలిగి వున్నవారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ముఖేష్ రిషితో పాటు బ్రహ్మాజీ కూడా కనిపించారు. పోస్టర్‌లో వారి లుక్ ఫెరోషియస్‌గా కనిపిస్తుంది. కన్నప్ప చిత్రంలో డా.మోహన్ బాబు, మోహన్ లాల్, ప్రభాస్, బ్రహ్మానందం, బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ సినిమాకు కీలకమైన పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. "కన్నప్ప" అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చే విజువల్ వండర్‌గా రాబోతోంది. సినిమాను చూసిన ప్రేక్షకులు సరికొత్త అనుభూతిని పొందే విధంగా, మరో ప్రపంచంలోకి వెళ్లిన ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే విధంగా మేకర్స్ చిత్రాన్ని రెడీ చేస్తున్నారు. ఇక సినిమా పట్ల అంకితభావంతో.. ఇష్టంతో విష్ణు మంచు కన్నప్ప పాత్రను ఈ చిత్రంలో పోషిస్తున్నారు. డా. మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ దర్శకుడు. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుంది. త్వరలోనే పూర్తి చేసి.. ఒకవైపు ప్రమోషన్ కార్యక్రమాలు, మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు స్టార్ట్ చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు ఎదురుచూస్తున్న ఈ విజువల్ వండర్‌ను డిసెంబర్‌లో పాన్ ఇండియాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.